క్లుప్తంగా

నేడు అయ్యప్ప పడిపూజ

తాండూరు: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం పడిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పూజా కార్యక్రమం ఆలయంలో సాయంత్రం 7 గంటలకు ప్రారంభమవుతుందని భక్తులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు.

నేడు రథోత్సవం

తాండూరు: భావిగి భద్రేశ్వర స్వామి రథోత్సవం శనివారం రాత్రి నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం ఉదయం ఆలయంలో కళశ పూజ నిర్వహించి అనంతరం పురవీధుల మీదుగా ఊరేగింపు తర్వాత సాయంత్రం 6 గంటలకు రథంపైకి కళశ ప్రతిష్ఠాపన ఉంటుందన్నారు. రాత్రి 11.05 గంటలకు రథోత్సవం ప్రారంభమవుతుందని చెప్పారు.

అశోక్‌కు శివనంది అవార్డు



అవార్డు అందజేస్తున్న మంత్రి, ఎంపీ

దౌల్తాబాద్: సుద్దముక్కలు, చాక్‌పీస్‌లపై వివిధ కళావృత్తులను చెక్కుతూ ప్రతిభ చాటుతున్న అశోక్ శుక్రవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి చేతులమీదుగా శివనంది అవార్డు అందుకున్నారు. మండల పరిధిలోని యాంకి గ్రామానికి చెందిన సున్నపు అశోక్ పాఠశాల దశ నుంచి కళలే అభిరుచిగా మలుచుకుని చిత్ర రంగంలో రాణిస్తున్న కృషికి గాను జాతీయ శివనంది అవార్డు వరించింది. అవార్డు అందుకున్న అశోక్ మాట్లాడుతూ.. తన నైపుణ్యాన్ని గుర్తించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అవార్డు అందుకున్న అశోక్‌ను గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.

భద్రాద్రి కల్యాణ తలంబ్రాల పంపిణీ



తలంబ్రాలను భక్తులకు అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

కుల్కచర్ల: ఆర్టీసీ అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. భీంరెడ్డి సీతారాముల కల్యాణ తలంబ్రాల కోసం ఆర్టీసీ సూచనలకు అనుగుణంగా డీడీలు చెల్లించగా శుక్రవారం ఆర్టీసీ అధికారులు డీడీలు కట్టిన వారి ఇంటికి వెళ్లి తలంబ్రాలను అందించారు. ఆర్టీసీ అధికారులు చంద్రయ్య తదితరులు వీటని పంపిణీ చేశారు.

కాంగ్రెస్‌తోనే బహుజనుల అభివృద్ధి



ప్రజలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

దౌల్తాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే బహుజనుల అభివృద్ధి సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లిలో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించారు. గ్రామ సమస్యలను తెలుసుకున్నారు. పార్టీ అధికారంలోకి రాగానే వంట గ్యాస్ సిలిండర్ రూ.500కే అందజేస్తామన్నారు. రూ.2లక్షల రైతు రుణమాఫీ ఏకకాలంలో చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ వెంకట్‌రెడ్డి, వెంకట్రాములు, కుర్మని దస్తప్ప, నర్సింగ్ భాస్‌సింగ్, శరణయ్య, రెడ్యానాయక్, రాజు, వీరన్న, కృష్ణ, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మనోహర్‌రెడ్డి తదితరులు

పరిగి: రంజాన్ మత సామరస్యానికి ప్రతీక అని డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని జామియా మజీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలోనే అన్ని మతాలకు సమన్యాయం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ రెడ్డి, జిల్లా కోఆప్షన్ మాజీ సభ్యుడు మీర్‌మహమూద్‌అలీ, ఎండీ షోహెబ్ తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మనోహర్ రెడ్డి



అనంతగిరి: మద్గుల్ చిట్టంపల్లిలో..



కొడంగల్: నివాళి అర్పిస్తున్న గురునాథ్‌రెడ్డి

కుల వ్యవస్థపై ఎక్కుపెట్టిన బాణం

• డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ • ఘనంగా ఆయన జయంత్యుత్సవం • నేతలు, ప్రజల నివాళి

జిల్లా వ్యాప్తంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రచించి పేదల తలరాతను మార్చిన మహనీయుడని కొనియాడారు. వెలివాడలో జన్మించి బడుగులకు వెలుగు పంచాడన్నారు. మట్టి మనుషుల ఒంటికి పట్టు కాంతులు ఇచ్చాడన్నారు. హక్కులు సాధించి అందలం ఎక్కించిన గొప్ప తత్వవేత్త అన్నారు. – వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ జోన్ బృందం



కొడంగల్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



పరిగి: నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు



తాండూరు: బీజేపీ ఆధ్వర్యంలో..



ధారూరు: నాగారం గ్రామంలో..



తాండూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



కొడంగల్ : నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి



పెద్దేముల్: బుద్దారంలో విగ్రహావిష్కరణ చేస్తున్న రమేశ్‌మహరాజ్



దోమ: బొంపల్లిలో నివాళులర్పిస్తున్న నేతలు

ఐక్యతను చాటిన అఖిలపక్ష నేతలు

తాండూరు: అంబేద్కర్ జయంతి సందర్భంగా అఖిలపక్ష నేతలు ఏకతాటిపైకి వచ్చారు. శుక్రవారం జై భీం అసోషియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం మహనీయుని విగ్రహాన్ని పట్టణంలో ఊరేగించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు హాజరై ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్, కౌన్సిలర్ నీరజాబాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణగౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, ఆయా పార్టీల నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, రాకేశ్ మహరాజ్, అబ్దుల్ రవూఫ్, పటోళ్ల నర్సింహులు, రొంపల్లి సంతోష్ కుమార్, బిర్కట్ రఘు, వెంకట్ తదితరులున్నారు.

రాజ్యాంగ నిర్మాతకు అవమానం



పాదరక్షలు ధరించి నివాళులర్పిస్తున్న పంచాయతీ కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డి

దోమ: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు అవమానం జరిగింది. శుక్రవారం మండల పరిధిలోని ఐనాపూర్ పంచాయతీ కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మల్లేశ్, ఉపసర్పంచ్ బుగ్గయ్యతో కలసి అంబేడ్కర్ జయంతి వేడుకలు ఏర్పాటు చేశారు. సర్పంచ్, ఉపసర్పంచ్ పాదరక్షలు విడిచినప్పటికీ పంచాయతీ కార్యదర్శి పాదరక్షలతోనే నివాళులర్పించారు. ఆ ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో చర్చనీయాంశంగా మారింది. దీంతో అంబేడ్కర్ వాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఓబీసీల ఉన్నతికి బీజేపీ కృషి

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు

కుల్కచర్ల: బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి బీజేపీ మాత్రమేనని కృషి చేస్తోందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఓబీసీ మండల అధ్యక్షుడు గుడాల వెంకటయ్య ఆధ్వర్యంలో 'పల్లెపల్లెకూ ఓబీసీ.. ఇంటింటికి బీజేపీ' కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా పేదలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఓబీసీల అభ్యున్నతికి బీజేపీ ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోందన్నారు. గ్రామస్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి 'పల్లెపల్లెకూ ఓబీసీ.. ఇంటింటికి బీజేపీ' కార్యక్రమాన్ని చేపడతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కులస్తుల సమస్యలను గుర్తించి ఆయా వర్గాల అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలను కేంద్రానికి నివేదిక అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు యాదయ్య, రాష్ట్ర నాయకులు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్, ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, హన్మంతు, నాయకులు చంద్రలింగం, కాటనిపల్లి అంజిలయ్య, నర్సింలు, గడుసు మైపాల్, కర్ణయ్య, కాటనిపల్లి మైపాల్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న నేతలు

జార్జ్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి

పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్

చేవెళ్ల: నవసమాజ నిర్మాణానికి పోరాడిన వీరుడు, పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు కామ్రేడ్ జార్జ్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తామని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్ అన్నారు. చేవెళ్లలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం జార్జ్‌రెడ్డి 51వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉస్మానియా క్యాంపస్‌లో అన్యాయాలను ఎదిరించి పోరాడిన యోధుడు జార్జ్‌రెడ్డి అన్నారు. ఆయన వారసులుగా ఆయన ఆశయాలను సాధించే బాధ్యత తమపై ఉందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు కే జైపాల్, కార్యదర్శి బీ శ్రీకాంత్, నాయకులు ఎం సురేష్, ఎన్ అశోక్, అనిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కరణలకు ఆద్యుడు అంబేడ్కర్



దోమ: అంబేద్కర్ విగ్రహావిష్కరణకు వెళ్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, పార్టీ శ్రేణులు

ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

దోమ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ సంస్కరణలకు ఆద్యుడని ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల కోసం దళితుల సంక్షేమం కోసం పోరాడిన యోధుడన్నారు. ఆయనలోని నాయకత్వ లక్షణాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం నగరంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు కార్యకర్తలతో ఆర్టీసీ బస్సులో బయల్దేరారు.



అనంతగిరి: బస్సులో తరలివెళ్తున్న ప్రజలు



ధారూరు: విగ్రహావిష్కరణకు వెళ్తున్న ప్రజాప్రతినిధులు, నేతలు

రూ.18వేల వేతనం ఇవ్వండి

ఎమ్మెల్యేకు వీఓఏల వినతి

కొడంగల్ రూరల్: వీఓఏలకు కార్మిక చట్టం ప్రకారం కనీస వేతనం రూ.18 వేలు అందించాలని శుక్రవారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాలకు చెందిన వీఓఏలు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళా సమైఖ్యలలో పనిచేస్తున్న వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల వివరాలను మహిళలకు తెలియజేస్తూ వారి అభివృద్ధికి కృషిచేస్తున్నామన్నారు. చాలీ చాలని పారితోషికంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఇన్సూరెన్స్ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించి వేతనాలను ప్రతీ నెలా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబసర్వే, గ్రామాల్లో నిర్వహించే గ్రామ జ్యోతి పథకాన్ని మహిళలకు వివరించినా అందుకయ్యే ఖర్చులను ప్రభుత్వం ఇవ్వలేదని గుర్తు చేశారు. ఇందుకు ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.



ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న వీఓఏ సంఘం నాయకులు

సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే

రైతుల ఇబ్బందులు పడకుండా ధాన్యాన్ని రైతు వేదికకు తరలించేందుకు అనుకూలంగా ఉండేందుకు నిర్మించిన సీసీ రోడ్డును శుక్రవారం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామంలో అంబేడ్కర్ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సయ్యద్ అంజద్, కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, నాయకులు బుగ్గప్ప, మొగులయ్య, జనార్దన్, రాజు, మొగులయ్య, సాయిలు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న విశాల

కేశంపేట: యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ టి.విశాల సూచించారు. మండలంలోని పాపిరెడ్డిగూడలో శుక్రవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడుతూ.. అంబేడ్కర్ సూచించి మార్గంలో యువత నడవాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని అందరు ఐక్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, నర్సింలు, పక్కీరయ్యగౌడ్ శ్రీను, రామస్వామి, ప్రేమ్, కుమార్, రవి పాల్గొన్నారు.

శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

షాబాద్: శాకాహారంతోనే మానవులు ఆరోగ్యంగా ఉంటారని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి, ప్రచారకర్త వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని సీతారాంపూర్, పోతుగల్, పోలారం, దేవునిగడ్డ, మాచన్‌పల్లి, నాగర్‌కుంట గ్రామాల్లో ప్రజలకు ధ్యానం వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానవుని శరీర నిర్మాణం, దంతాలు, పేగుల వ్యవస్థలు కేవలం శాఖాహారం తినడానికి మాత్రమే ఉన్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలన్నదే తమ సొసైటీ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, బాలకృష్ణారెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

పల్లె నిద్రలు కాదు.. కష్టాలు తెలుసుకోండి

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కుల్కచర్ల: రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు పల్లెనిద్రలు చేస్తున్న నాయకులు ప్రజా సమస్యలను తెలుసుకోవాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే టీఆర్ఆర్ తనయుడు రితిక్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రితిక్‌రెడ్డి మాట్లాడుతూ.. పేపర్ లీకేజీతో యువత తీవ్రంగా నష్టపోయి మనోవేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెల్లోకి వెళ్లి నిరుద్యోగుల సమస్యలను తెలుసుకోవాలన్నారు, ధరణితో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, ఎంపీటీసీ సభ్యుడు ఆనందం, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

బహుమతుల ప్రదానం

మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీలో శుక్రవారం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. మొదటి బహుమతిగా బండవెల్కిచర్ల జట్టుకు రూ.30వేలు, రెండో బహుమతిగా చెల్లాపూర్ జట్టుకు రూ.15వేలు అందించారు. ఈ స్థానిక సర్పంచ్ శిరీషాలక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవాలను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు, గ్రామస్తులు

సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్

కుల్కచర్ల: సేవాలాల్ ఆలయ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్, దాస్యనాయక్ తండా ఆలయ కమిటీ నేతలు హరిలాల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దాస్యనాయక్ తండాలో సేవాలాల్ ఆలయ వార్షికోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి 27వరకు ఉత్సవాలు జరుగుతాయని.. భక్తులు పెద్ద ఎత్తున ఆశీస్సులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.